క్లుప్తంగా

నేటి నుంచి ఎల్లమ్మ జాతర

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో పురాతన కాలం నాటి ఎల్లమ్మ తల్లి జాతర శని, ఆదివారాలు రెండు రోజులు జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బన్నలు తెలిపారు. గ్రామంలో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే ఆదివారం జాతర నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు. శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం రాత్రికి ఎల్లమ్మ ఆసాదు కథ, తెల్లవారుజామున ఏడు రంగులతో ఎల్లమ్మతల్లి ప్రతిమ తయారు చేయడం జరుగుతుందని, ఆదివారం ఉదయం పొంగళ్లు పొంగించి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని చెప్పారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించనున్నట్లు తెలియజేశారు.

శీతల గంగమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం వచ్చిన భక్తులు అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొని, కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఉచిత ఖత్నా

రాజంపేట టౌన్ : రాజంపేట, నందలూరు మండలాల్లోని ఐదు మంది పేద పిల్లలకు మండల కో-ఆప్షన్ మెంబర్, ముస్లింమైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాజంపేట నియోజక వర్గ అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా ఒడుగులు (ఖత్నా) నిర్వహించారు. అనంతరం ఆయన ఒడుగులు చేయించుకున్న వారికి అవసరమైన మందులు, ఆహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్‌జీ ఇనాయతుల్లా, ఎండీ.కరీం, పి.మోసిన్‌ఖాన్, ముజఫర్ అహమ్మద్, డాక్టర్ ఇక్బాల్, సయ్యద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న జిల్లా తదితరులు

గాలివీడు : గాలివీడు మండలం గోరాన్‌చెరువు గ్రామం బండివాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బండి నాగిరెడ్డి అకస్మాత్తుగా మృతి చెందడంతో రాష్ట్ర మాజీ డీటీపీ జిల్లా సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణరెడ్డి, పార్టీ కన్వీనర్ యదుభూషణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి చిన్నిరెడ్డి, వాణిజ్యశాఖ కన్వీనర్ దాసరి మధుసూదన్, సర్పంచ్ దీప్తి వెంకటాద్రిలు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా నాగిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిలు తమ ప్రగాఢ సంతాపాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.

రైల్వే ట్రాక్ దాటడం నేరం

నందలూరు : ప్రజలు, ప్రయాణికులు రైల్వే ట్రాక్ దాటడం చట్టరీత్యా నేరమని అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ త్రివేణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆమె ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఇయర్ ఫోన్స్ పెట్టుకుని ఫోన్ మాట్లాడుతూ కొంత మంది సెల్ఫీల మోజులో పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. పశువులు, గొర్రెల యజమానులు ట్రాక్ వెంబడి మేపడం, దాటడం చేయకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ రాధాకృష్ణ, ప్రయాణికులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో మోస్తరు వర్షం


చిన్నమండెం : నైరుతి రుతుపవనాలకు అల్పపీడన ప్రభావం తోడవ్వడంతో చిన్నమండెం మండల వ్యాప్తంగా శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. మండలంలో ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉండటంతో వాతావరణం చల్లబడింది. దీంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు కొంత మేర ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ వర్షం రాకతో భూమిలో నీరు ఇంకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరింతగా వర్షం పడాలని దేవున్ని రైతులు ప్రార్థిస్తున్నారు.

పనిఒత్తిడితో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు అస్వస్థత

రాజంపేట : మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న హర్షవర్ధన్ పనిఒత్తిడితో అస్వస్థతకు గురయ్యారు. ఆర్‌ఎస్‌రోడ్డులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. ఆరోగ్యం బాగానే ఉందనే సమాచారం మున్సిపాలిటీ వర్గాలకు అందింది. అయితే మున్సిపాలిటీ కమిషనరు పట్టణంలో ప్రజలకు మెరుగైన రీతిలో పారిశుధ్యం అందించే క్రమంలో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పకడ్బందీగా విధులు నిర్వర్తించేలా దృష్టి సారించారు. ఈ క్రమంలోనే హర్షవర్ధన్ పనిఒత్తిడికి గురైనట్టు మున్సిపాలిటీ వర్గాలు చెబుతున్నాయి. పని ఒత్తిడితో నా భర్తను కమిషనరు వేధిస్తున్నారంటూ, తన భర్త ఆరోగ్యం బాగాలేకపోయినా విధులు హాజరుకావడం జరుగుతోందని హర్షవర్ధన్ భార్య ఆరోపించారు. ఈమెకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కమిషనరు శ్రీనివాసులు వివరణ కోరగా తనపై చేసిన ఆరోపణలు అవాస్తమన్నారు.

మహిళలకు 'కూటమి' కుచ్చుటోపి!

- అటకెక్కిన చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు
- ఆడబిడ్డ నిధి అధోగతి
- పథకాల కోసం 3,71,462 మహిళల ఎదురుచూపు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళలే మహారాణులు
- నాడు మహిళల చేతిలో డబ్బులు గలగల.. నేడు వెలవెల



రాయచోటి : ఆకాశంలో సగమైన మహిళలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వారికి కల్పిస్తున్న అవకాశాలు శూన్యమని చెప్పవచ్చు. ఎన్నికల ముందు మహిళలను లక్షాధికారులను చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో నమ్మించి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు వారి బాగోగులను గాలికి వదిలేసింది. మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకం అందరిలో ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మహిళా సాధికారికత కోసం ఉద్దేశించిన సంఘాలు ఏడాదిలోని తిరోగమన బాట పట్టాయి. గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో ఆర్థికంగా మహిళలు బలోపేతమయ్యారు. జగనన్న సర్కారులో మహిళలే మహారాణులుగా వెలుగొందారు. అంతే కాకుండా వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు దక్కిన గౌరవం.. వారికందిన ఆర్థిక స్వావలంబనతో వారి ఇంట ఆర్థిక సిరులు కురిశాయి. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న వారికి ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయకపోవడం పై మహిళల మండిపడుతున్నారు.

పథకాల కోసం వేచి చూస్తున్న 3,71,462 మంది మహిళలు

అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి, రాజంపేట, కోడూరు నియోజవర్గాల్లో 3,71,462 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో 60 శాతానికి పైగా 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు ఉన్నారు. వీరందరి ఓట్లను అనుకూలంగా మార్చుకునేందుకు కూటమి నేతలు హామీల వరాలను గుప్పించారు. ఎన్నికల అనంతరం హామీల అమలు ఊసే ఎత్తలేదు.

ఆడబిడ్డ నిధి ఊసేది

2024 ఎన్నికల సమయంలో 18 సంవత్సరాలు నిండిన బాలిక నుంచి 45 సంవత్సరాల లోపు మహిళలకు ప్రతినెలా రూ.1500లు వారి అకౌంట్లో జమ చేస్తామన్న మాట బూటకమైంది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట మాత్రంగానైనా స్పందించడం లేదు. కూటమి పాలన అధికారంలోకి రావడంతో 18 సంవత్సరాలు నిండిన మహిళలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. వారి ఆశలను నిరాశలను చేస్తూ నేటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం మోసపూరితమనే వాదన మహిళల నుంచి వ్యక్తమవుతోంది.

తల్లికి వందనం కోసం ఎదురుచూపులు

పథకాలను ఠంఛన్‌గా ఇచ్చిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుంది. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్ ప్రతి యేట విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమ్మఒడి పేరున ప్రతి విద్యార్థికి రూ.13 వేలు జమ చేసేవారు. కూటమి పాలన వచ్చి ఏడాది ముగిసిన గత విద్యా సంవత్సరానికి అందాల్సిన తల్లికి వందనం వాయిదాలు పడుతూ వస్తోంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం ముందుగానే ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు ఇప్పటికి అమలు కాలేదు. తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారా అని రాజంపేట రాయచోటి కోడూరు ప్రాంతాలలో ఉన్న 50వేల మందికి పైగా బాలికలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఇస్తామన్న తల్లికి వందనం 15 వేల రూపాయలు పూర్తిగా ఇస్తారా కోత వేస్తారా అన్న భయం బాలికలు వారి తల్లిదండ్రులు ఉంది.

ఉచిత బస్సు ఎక్కడ..?

మహిళలను మహారాణులుగా చేయడంతో పాటు వారు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పిన కూటమి నాయకుల మాటలు గాలి మాటలయ్యాయి. ఇదిగో బస్సు.. అదిగో ఎక్కండి అంటూ ఉపన్యాసాలతోనే ఉచిత బస్సును ఏడాది పాటు గారడీల పేరుతో కాలక్షేపం చేశారు. నేడు తిరిగి ఆగస్టు 15 తేదీ నుంచి ఉచిత బస్సు అంటూ మాట మార్చారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే జిల్లాక లేక రాష్ట్రవ్యాప్తంగా అన్న విషయంపై స్పష్టత రావడంలేదని మహిళలు వాపోతున్నారు.

సున్నా వడ్డీ శూన్యం

డ్వాక్రా మహిళలకు 0 వడ్డీతో రుణాలు ఇస్తామన్న కూటమి మాటలు నీటి మూటలు అయ్యాయి. రాయచోటి రాజంపేట కోడూరు నియోజవర్గల్ పరిధిలో 5554 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. గ్రూపునకు పది మంది చొప్పున 55,540 మంది మహిళలకు 0 వడ్డీ పేరుతో ప్రభుత్వం మోసం చేసింది. ఇలాంటి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలు ఉన్న గౌరవం లేకుండా ఉచిత హామీలతో వారిని నిండా ముంచింది.

ఇంకెప్పుడు అమలు చేస్తారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్నా ఇంత వరకు మహిళలకు సంబంధించిన పథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారు. ఎన్నికలలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం మహిళలకు అందాల్సిన పథకాలను వెంటనే అందజేయాలి. ఎన్నికల ముందు ఏదో ఒకటి చెప్పి అధికారం చేపట్టి అనంతరం మరవడం టీడీపీ ప్రభుత్వానికి అలవాటైపోయింది. పోయిన సంవత్సరం కూడా తల్లికి వందనం అందలేదు. ఇప్పుడేమో ఇంత వరకు ఆ పథకం ఊసే లేకుండా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పథకాలను వెంటనే అమలుపరచాలి.

– డి.లక్ష్మీదేవి, మల్లూరు గ్రామం, చిన్నమండెం

ఎప్పుడు ఇస్తారు సీఎం సారూ?



ఆడబిడ్డలకు నెలకు రూ.1500లు ఇస్తామని చెప్పిన హామీని ఎప్పుడు అమలు చేస్తారు సీఎం సారూ. ఏడాదికి రూ.18 వేలు ఇవ్వాల్సి ఉంది. ఎప్పుడు అమలు చేస్తారో తెలియడం లేదు. ఎప్పటికప్పుడు ఉచిత బస్సు ప్రయాణం గడవు పొడిగిస్తూనే ఉన్నారు. జగనన్న సర్కార్‌లో మహిళలే మహారాణులు. అమ్మ ఒడి, సున్నా వడ్డీ ద్వారా రూ.1,102 కోట్లు లబ్ధి నాడు మహిళల చేతిలో డబ్బులు గలగల నేడు వెల వెల అన్న చందంగా మహిళల పరిస్థితి మారింది.

– పొదిలి దేవి, నందలూరు

మాట తప్పిన కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు పెద్దపీట వేసి బడికి వెళ్లే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ. 15 వేలు వేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం అవుతున్నా తల్లికి వందనం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మహిళలను తీవ్రంగా మోసగించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరుమార్చి సూపర్ సిక్స్‌లో చేర్చి మహిళల ఓట్లను దండుకున్నారు. ఇప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలాన్ని వృథా చేస్తూ ఇదిగో.. అదిగో అంటూ చివరకు ఎన్నికల వరకు ప్రభుత్వాన్ని నెట్టుకొచ్చే ధోరణిలో కూటమి ప్రభుత్వం ఉన్నట్టు అనిపిస్తోంది. కూటమిని నమ్మి మోసపోయాం.

– చెంచుగర్ల వెంకటమ్మ, ఎస్సీ కాలనీ, ఒంటిమిట్ట

వెంటనే పథకాలను అందించాలి



నా పేరు వెంకట సుబ్బమ్మ. నేను జీవనరీత్యా వ్యవసాయ కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాను. కూలి డబ్బులు కుటుంబ పోషణకు కూడా రావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, డ్వాక్రాలో సున్నా వడ్డీ ద్వారా ప్రతి ఏడాది లబ్ధి చేకూరేది. ఈ ప్రభుత్వం ఎన్నికల హామీలో మహిళలకు ఉచిత బస్సు రవాణా, అలాగే ఆడబిడ్డ నిధి ద్వారా మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళలకు ఎటువంటి హామీని నెరవేర్చలేదు. ఎన్నికలలో మహిళలకు ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి.

– వెంకటసుబ్బమ్మ, సుండుపల్లె

పథకాలు ఇస్తారన్న నమ్మకం లేదు



నా పేరు లక్ష్మి. మాది రాయచోటి. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తారనే ఆశతో ఎదురు చూశాం. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా విస్మరించారు. అంతే కాదు ఆయన కొడుకు లోకేష్ బాబులు ఇద్దరు పేదలను మోసం చేశారు. మహానాడులో పేదల కోసం ఇచ్చిన హామీలను ప్రకటిస్తారేమోనని ఆశ పడ్డాం. మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.1500లు మాట ఊసెత్తలేదు. డ్వాక్రా మహిళలకు ఇస్తానన్న రుణాలు ప్రకటించలేదు. మూడు సిలిండర్లు ఉచితం అన్నారే కానీ అవి ఎక్కడా అమలు కావడం లేదు. ఎక్కడో ఒకరికో ఇద్దరికో మాత్రమే వస్తున్నాయి. ఇక తల్లికి వందనం అన్నారే కానీ ఇస్తారన్న నమ్మకం లేదు. ఉచిత బస్సు కూడా ఉత్తిత్తేనే అనిపిస్తోంది. చంద్రబాబు నాయుడిని నమ్మి మహిళలం మోసపోయాం.

– విజయలక్ష్మి, గృహిణి, రాయచోటి

వెన్నుపోటుకు పేటెంట్ చంద్రబాబునాయుడు

జూన్ 4న వెన్నుపోటు దినం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజంపేట టౌన్ : చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు పేటెంట్‌లాంటి వ్యక్తి అని వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, డి.భాస్కర్‌రాజు, బీసీ సెల్ నాయకుడు వడ్డే రమణ ఎద్దేవా చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకు వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం దివంగత ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా వెన్నుపోటు రాజకీయాలే కొనసాగిస్తున్నాడన్నారు. ఆయన టీడీపీ పగ్గాలు చేపట్టాక ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఎన్నికల్లో ప్రజలకు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి, ప్రజలతో ఓట్లు వేయించుకొని ఆ తరువాత ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ విప్లవాన్ని సృష్టించారన్నారు. వైఎస్ ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల నిరుపేదలు సైతం ఉచితంగా ఉన్నత విద్య అభ్యసించి పెద్దస్థాయి ఉద్యోగాలు పొంది పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలు సైతం ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొంది ప్రాణాలను నిలుపుకున్నారని, 108 పథకం వల్ల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వేలాది మందికి సరైన సమయంలో వైద్యం అంది ప్రాణాలు నిలబడ్డాయన్నారు. ఉచిత విద్యుత్‌తో రైతుల జీవితాలను మార్చిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. జగన్ సీఎం అయ్యాక అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. సంక్షేమ పథకాల ఫలాలను ఠంఛనుగా పేద, మధ్య తరగతి ప్రజలకు అందచేయడం వల్ల లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా ఎంతో లబ్ధిపొందాయని తెలిపారు. ఇటు వైఎస్సార్ అటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని తెలిపారు. అయితే చంద్రబాబునాయుడు మాత్రం సీఎం అయిన ప్రతిసారి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, జూన్ 4వ తేదీ నాటికి బాబు ప్రజలను వంచించి వెన్నుపోటు పొడిచి ఏడాది అవుతున్న సందర్భంగా ఆ రోజున పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఈసందర్భంగా ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి మార్కెట్, పాత బస్టాండు, ఆర్‌ఎస్‌రోడ్డు మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చని పథకాలపై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథరెడ్డి, ఖాజామొహిద్దీన్, రఘునాథరెడ్డి, దయానంద, జీవీ సుబ్బరాజు, సుధాకర్, శివకుమార్‌రాజు, గొంటు మణి, సోంబత్తిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా చేయించుకోవాలి

సిద్దవటం : పశువుల బీమా చేయించని పాడి రైతులు ఎవరైనా ఉంటే తప్పకుండా బీమా చేయించుకోవాలని కడప డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు టి.వెంకటరమణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిని శుక్రవారం విస్తృత తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య మాట్లాడుతూ పశువుల బీమా చేయించుకున్న తరువాత ఒక వేళ పశువు చనిపోతే రూ. 30 వేలు వరకు బీమా వస్తుందన్నారు. తొలకరి వర్షం వస్తే పశువులకు, దూడలకు గొంతువాపు వ్యాధి, గొర్రెలకు చిటుకు రోగం వస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా డివిజన్ పరిధిలోని అన్నీ పశువుల ఆసుపత్రులకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేశామన్నారు. పశు సంవర్ధక శాఖసిబ్బంది సమయపాలన పాటించి తొలకరి వర్షంలో వ్యాక్సినేషన్ పట్ల సిబ్బందికి అందుబాటులో ఉండేలా తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. అత్యవసరంగా వ్యాక్సినేషన్ పశువులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలియజేశామన్నారు. అంతే గాకుండా 50 శాతం సబ్సిడీతో 2.4 మెట్రిక్ టన్నుల కామదేను రకం పశువుల దాణా పంపిణీ చేస్తున్నామన్నారు. మండలానికి 140 మంది పాడి రైతులకు ఈ దాణా పంపిణీ చేశామన్నారు. దీంతో రైతులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. ఈ దాణా మరో విడత కూడా వస్తుందని కావాల్సిన పాడి రైతులకు అందజేస్తామన్నారు. అంతేగాకుండా కడప డివిజన్‌కు జొన్న రకానికి చెందిన 10 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు మంజూరయ్యాయని, వీటిని 75 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తామన్నారు. కావలసిన పాడి రైతులు గడ్డి విత్తనాలను పొందవచ్చునని ఆయన అన్నారు. కార్యక్రమంలో కడప డివిజన్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాసులరెడ్డి, సిద్దవటం పశువుల ఆసుపత్రి అధికారి బి.లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రస్తుత జీవనశైలిలో యోగాతో ప్రశాంతత



రామాలయ ప్రాంగణంలో ఆసనాలు వేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

ఒంటిమిట్ట : నేటి ప్రజా జీవనశైలితో నిత్యం అనారోగ్యం పాలవుతున్న ప్రజలకు యోగాతోనే ఆరోగ్యం లభిస్తుందని కడప జిల్లాలోని పలుశాఖల అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలోని పచ్చని వనంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాకు సంబంధించిన ఇన్‌స్ట్రక్టర్లు ప్రాథమిక యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించి వాటి లాభాలను వివరించారు. రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక శాంతి సిద్ధించి ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ గౌస్ బాషా, తహసీల్దార్ వెంకటరమణ, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గాలివీడు : బాలికలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగివుండాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం నడింపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, బడ్జెట్ తయారీ, పొదుపు, పెట్టుబడులు, అవసరాలు, భవిష్యత్ లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఉపాధి పనులు గుర్తింపు



క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు

పెనగలూరు : మండలంలోని ఉపాధి కూలీలకు కొత్త పనులను గుర్తించినట్లు ఎంపీడీఓ విజయారావు, ఏపీఓ మీనా కుమారీలు తెలిపారు. కొండూరు పంచాయతీలో కొత్త పనులు లేవని కూలీలు తెలపడంతో కూలీల పనుల నిమిత్తం ఉపాధి సిబ్బందితో కలిసి కొత్త పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ పనులను మండల ప్లాన్‌లో జిల్లాకు పంపించి మంజూరు చేయించడం జరుగుతుందని చెప్పారు. మంజూరు కాగానే కూలీలకు పనులు కల్పిస్తామని పేర్కొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి రాజ్యసభ ఎంపీ నిధులు



రాజంపేటలోని కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

రాజంపేట : రాజంపేట కూరగాయల మార్కెట్ అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి రూ.25లక్షల నిధులను కేటాయించారు. శుక్రవారం మున్సిపాలిటి ఏఈ మల్లేష్, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్, డొంకా సురేష్, ఎస్ఎండీ న్యాయతుల్లా, వైఎస్సార్‌సీపీ పట్టణ నేతలు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, అబ్దుల్ మునాఫ్‌లు కలిసి కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. మార్కెట్ ప్రాంతంలో కలియతిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌ను సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు సిమెంట్ కాంక్రీట్‌తో ఫ్లోరింగ్ వేయాలనే అంశంపై చర్చించారు. వర్షాకాలంలో కూరగాయల వ్యాపారులతోపాటు పట్టణవాసులు కూడా మార్కెట్‌లోకి వచ్చేందుకు వీలుగా రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి నిధులను కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి హాజరయ్యారన్నారు. ఈ సందర్భంలో కూరగాయల మార్కెట్ దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో మేడా సానుకూలంగా స్పందించారు. ఎంపీ నిధులు తన కోటాలో కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ దృష్ట్యా తాము కూరగాయల మార్కెట్‌లో చేయాల్సిన పనులపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ వేయిస్తామన్నారు.

కార్మికవర్గ ప్రయోజనాలే సీఐటీయూ లక్ష్యం

రాయచోటి జగదాంబ సెంటర్ : ఐక్యత, పోరాటం నినాదంతో 1970లో ఆవిర్భవించిన సీఐటీయూ నేటి వరకు దేశవ్యాప్తంగా కార్మికవర్గ ప్రయోజనాలే లక్ష్యంగా ఉద్యమిస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయచోటి బస్టాండు వద్ద సీఐటీయూ జెండాను జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకట్రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందని తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకి తెచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నదని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జులై 9న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు సార్వత్రిక సమ్మె నిర్వహిస్తోందని ఈ సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు రామాంజులు, ఏవీ రమణ, రవికుమార్, మణి, మున్సిపల్ కార్మికులు చెన్నయ్య, సిద్దయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్‌కు సత్కారం



జెడ్పీచైర్మన్ రామ్‌గోవిందరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డిని నందలూరు మండల అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండల అభివృద్ధి విషయంలో తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రజలకు, నాయకులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చినట్లు ఎంపీపీ మేడా తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మండలానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్టు ఎంపీపీ తెలియజేశారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లాఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.